# ఆడవాళ్ళూ! మీరు గులాబీలు!!

"ఈరోజు ఒక విచిత్రమైన కేసు వచ్చిందోయ్. అందుకే ఉదయం నీకు ఫోన్‌చేసి సాయంత్రం రమ్మని పిలిచింది." అన్నాడు డాక్టర్ విశ్వమోహన్.

"అంత విచిత్రమైన కేసా?" అన్నాడు ఖరీదయిన సిగరెట్టు పొగల్లో స్వేచ్ఛననుభవిస్తూవున్న డాక్టర్ రాజశేఖర్. "కేసు మామూలే! కానీ, ఆ ప్రేమికులిద్దరూ టీనేజర్స్. అంత చిన్నవాళ్ళు అబార్షన్‌కోసం నిర్భయంగా, నాదగ్గరకు రావడం....వాళ్ళ మనస్తత్వం నాకు చోద్యంగావుంది." ఎంత అడ్వాన్స్‌మెంట్! పెద్దగా నవ్వాడు రాజశేఖర్.

ఇద్దరు డాక్టర్లూ చిరకాల మిత్రులు. ఉద్యోగం రీత్యా ఇద్దరూ కలుసుకొని చాలా కాలమయింది. డాక్టర్ విశ్వమోహన్ ఆ ఊరికి ట్రాన్స్ ఫర్ అయివచ్చి, నెలకూడా కాలేదు. వచ్చినప్పటినుండి బిజీ, రాజశేఖర్ ప్రయివేట్ డాక్టర్ మంచి ప్రాక్టీసున్న మనిషి. సంధ్య రంగుల పౌడర్ అద్దుకుని, రేయి హాయిని పంచుకోవాలని తహతహలాడుతోంది.

డాక్టర్లిద్దరూ హాస్పిటల్ కారిడార్‌లో ఛెయిర్స్ వేసుకుని, మాట్లాడు కుంటున్నారు. "ఊఁ....! వివరాలు చెప్పూ?" అని అడిగాడు డాక్టర్ రాజశేఖర్. ఇంతలో 'టీ' వచ్చింది. ఇద్దరూ అందుకున్నారు. వెచ్చని టీ పెదాలను స్పృశిస్తూవుంటే అదో ఉత్తేజం!

"ఆ అమ్మాయి వయసు పదహారు సంవత్సరాలకు లోపే వుంటుంది, కవయితలయితే ఆ కన్యను 'పచ్చని ఆకుల మధ్య ప్రాణం పోసు కుంటున్న ఎర్రని గులాబి మొగ్గ, అని వర్ణిస్తారేమో— అంత అందంగా, కన్ను ముక్కుతీరు చక్కగావుంది. అబ్బాయికీ దాదాపు అంతే వయసు. తమాషా ఏమిటంటే ఇద్దరూ వచ్చారు నా దగ్గరికి బెరుకుబెరుగ్గా చూస్తూ.

వచ్చిన పని మొదట ఇద్దరూ చెప్పలేకపోయారు. తర్వాత ఆ అమ్మాయే ధైర్యంచేసి చెప్పింది, తను 'ప్రెగ్నెంట్' అని! అబార్షన్ చేయించుకునేందుకు వచ్చాననని" టీ పూర్తిచేసి, కప్పు టీపాయ్‌మీద పెట్టే శాడు విశ్వమోహన్.

"నువ్వేం చెప్పావ్?" రాజశేఖర్ ఇంకా టీ సిప్ చేస్తూనే వున్నాడు. "నేనా?—" ఉదయం జరిగిన సంభాషణ జ్ఞప్తికి తెచ్చుకున్నాడు విశ్వ మోహన్. "మీరిద్దరూ ప్రేమించుకున్నారా?" అడిగాడు డాక్టర్ విశ్వ మోహన్. "అవును" ఇద్దరూ ఏక కంఠంతో పలికారు. అందులో విజాయితీ ధ్వనించింది.

"పెళ్లి చేసుకోవాలనుకోలేదా?" డాక్టర్ అడిగాడు సూటిగా వాళ్ళను చూస్తూ, "తప్పకుండా చేసుకుంటాం"— మళ్ళీ ఇద్దరూ కలిసే పలికారు ధృఢంగా. "దెన్ నో ప్రాబ్లెమ్, మళ్ళీ అబార్షన్ ఎందుకు?" డాక్టర్ కళ్ళు కనిష్ఠువులయ్యాయి.

"ప్లీజ్! డాక్టర్; హెల్ప్ చెయ్యండి. ఆ తర్వాత ఇద్దరూ పెళ్ళి చేసుకుంటాం." ఇప్పుడు అమ్మాయి చెప్పింది. అబ్బాయి వంక చూశాడు డాక్టర్. 'ప్రామిస్ డాక్టర్' అన్నట్టుంది అతని ముఖ కవళిక.

ఆమె అతని వంకే, కన్నార్పకుండా చూడడం డాక్టర్ గమనించాడు. ఎంత ఆరాధనో? "ఓ. కె రేపు ఇదే టైంకు రండి. చెప్తాను" అంటూ లేచాడు. "చెప్తాను కాదు డాక్టర్, చేస్తాను అనండి" అన్నది అమ్మాయి కాస్త చొరవగా.

"ఆల్ రైట్! ఓ.కె.?" అంటూ డాక్టర్ స్టెతస్కోపు అందుకున్నాడు. ఇద్దరూ లేచి నమస్కరించారు

టీ పూర్తిచేసి, సిగరెట్ ముట్టించుకొన్న డాక్టర్ రాజశేఖర్ డాక్టర్ విశ్వమోహన్ చెప్పిన విషయమంత విని 'వాళ్ళు టీనేజర్స్ ఆ వయసులో వాళ్ళను మనం ఎన్కరేజ్ చేయకూడదు!' అన్నాడు సాలోచనా.

"మనం డాక్టర్లం, తీసుకోవలసింది కేసు, దాని బాక్ గ్రౌండ్ కాదు" అన్నాడు విశ్వమోహన్. 'ఆఫ్‌కోర్స్, కానీ ఒక్కోసారి టేకప్ చేసిన కేసు పరిణామాల్ని కూడా మనం ఎదుర్కోవలసి వస్తుంది.' అన్నాడు రాజశేఖర్ సిగరెటు మసిరాలుస్తూ.

"అందుకే—వాళ్ళ విషయంలో ఇంకా ఆలోచిస్తున్నాను; నీతో డిస్కస్ చేస్తున్నాను" అన్నాడు విశ్వమోహన్, దూరాన ఆఖరి వెలుగు వెలిగి, పడమటి కుక్క గుండెల్లోకి దిగిపోతున్న సూర్యుణ్ణి తదేకంగా చూస్తూ. "మోహన్! వాళ్ళకు హెల్ప్‌చేస్తే మనం చెడును ప్రోత్సహించినట్టే" అన్నాడు రాజశేఖర్ సిగరెట్టును ఎర్రగా మండిస్తూ.

"అంటే— వాళ్ళు చేసింది తప్పంటావా?" సూటిగా రాజశేఖర్ కళ్ళల్లోకి చూశాడు విశ్వమోహన్. 'హండ్రెడ్ పర్సెంట్!' దృఢంగా వుంది రాజశేఖర్ గొంతు, 'వాళ్ళ వయస్సెంత? వాళ్ళెంత? ఆఫ్టరాల్ దె ఆర్ కిడ్స్, అసలు వాళ్ళను కాదు; వాళ్ళ తలితండ్రులననుకోవాలి— సరైన డిసిప్లిన్‌లో పెంచనందుకు??'— విపరీ దమ్ములాగి, సిగరెట్ ముక్కను యాష్‌ట్రేలో నొక్కాడు.

"నీ ఆలోచన సరిగాలేదు. తప్పుచేసి, అమ్మాయి ఒక్కతే నా దగ్గరకు రాలేదు. చేసిన తప్పును ఇద్దరూ ఒప్పుకుంటున్నారు; ప్రాధేయ పడుతున్నారు." "నో—యు ఆర్ రాంగ్! అంతమాత్రాన చేసిన తప్పు నుండి వాళ్ళు తప్పించుకోగలరా?"

"అందుకేగా మన దగ్గర కొచ్చింది:" "యాజ్ ఎ డాక్టర్, ఐ నో యిట్. మరి వాళ్ళకు అప్పుడే నువ్వెందుకు సహకరించలేక పోయావ్? అది మన ఆచారానికి విరుద్ధం. గాబట్టి అందుకే నువ్వు ఆలోచనలో పడ్డావ్, అంతేనా!"

"వాయేజర్ శనిగ్రహం దాటిపోయాక కూడా ఈ ఆచార వ్యవహారాలు మన రక్తంలోని రంగు కణాల్లో యింకా పీటేసుకు కూర్చున్నాయంటావా? మనం సైన్స్ చదువుకున్న వాళ్ళం. మనలోనూ ఆ భావాలు మిగిలి వున్నాయంటావా?? ఏంటోయ్, నీథోరణీ–నువ్వూ" అన్నాడు విశ్వమోహన్. "అదికాదు మోహన్! అబార్షన్స్ టీ నేజర్స్‌లో మనం ప్రోత్సహించ కూడదు. అదే నా ఆర్గ్యుమెంట్''

'మరి, వాళ్ళేమయి పోవాలి?' 'రేపు వాళ్ళొస్తే పంపేయ్, వీలు కాదని చెప్పు.' 'ఆల్ రైట్!' అంటూ పైకి లేచిన విశ్వమోహన్‌కు మిత్రుని సలహా నచ్చలేదు. వాళ్లిద్దరికీ సహాయం చెయ్యాలనే మనసులో నిర్ణయించుకున్నాడు.

మరురోజు. ఆ ప్రేమికుల జంట చెప్పిన సమయానికి టంచన్‌గా ప్రత్యక్షమయ్యారు. డాక్టర్ విశ్వమోహన్ వారితో మాట్లాడేలోగా–డాక్టర్ రాజశేఖర్ హాస్పిటల్ నుండి ఫోన్ కాల్ వచ్చింది, ఓ ఆపరేషన్‌కు అటెండ్ కమ్మని!

"శేఖర్! నిన్న మనం మాట్లాడుకున్న అమ్మాయి, అబ్బాయి వచ్చారు, వాళ్ళకు నేను హెల్ప్ చెయ్యాలని నిర్ణయించుకున్నాను, నువ్వు మరో డాక్టర్‌ను చూసుకో!" అని ఖచ్చితంగా చెప్పాడు

ఊళ్ళో చాలామంది డాక్టర్లున్నారు. వాళ్లే పోతారు. ఇది చాలా సీరియస్ కేస్, నువ్వే కావాలి మరో డాక్టర్‌తో మాట్లాడే వ్యవధి కూడా లేదు వెంటనే బయలుదేరు." అని, ఫోన్ పెట్టేశాడు డాక్టర్ రాజశేఖర్. వచ్చేవరకు వుండమని ఆ ప్రేమికులతోచెప్పి, వెంటనే వెళ్ళిపోయాడు డాక్టర్ విశ్వమోహన్.

కొన్ని గంటల తర్వాత వచ్చిన విశ్వమోహన్-అదే కేస్ మీద బొంబాయి వెళుతున్నట్లు చెప్పి, వెళ్ళిపోయాడు. ప్రేమికులిద్దరూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు. నన్నటి నీటి పొరచూపు మసకచేస్తూ తెరగా జారింది. కానీ వాళ్ళు ఒకరి నొకరు స్పష్టంగా చూసుకోగలుగు తున్నారు.

*　　　*　　　*　　　*

బొంబాయినుండి వారం తర్వాత వచ్చాడు. డాక్టర్ విశ్వమోహన్. హాస్పిటల్‌కు రాగానే - ఆ టీనేజ్ లవర్స్ గుర్తొచ్చారు. ఒక నర్స్‌ను పిలిచి అడిగాడు.

వాళ్ళు రెండు మూడు రోజులు వరసగావచ్చి వెళ్ళారని నర్స్ చెప్పింది, మాటల్లో వుండగనే— ఓ సీరియస్ కేసొచ్చిందని డాక్టర్‌కు కబురొచ్చింది. హడావుడిగా వెళ్ళిన విశ్వమోహన్ అదిరిపడ్డాడు, పేషంటును చూసి.

బెడ్‌మీద ఆఖరి శ్వాసలో గిలగిల కొట్టుకుంటూవుంది, అంతకు ముందు అబార్షన్ కోసం వచ్చిన అమ్మాయి. ఆమె ప్రియుడు అసహాయంగా ఆమె ముఖంలోకి చూస్తూ పక్కనే వున్నాడు. "ఏం జరిగింది?" నిబ్బరంగా అడిగాడు విశ్వమోహన్, ఆమెను చెక్ చేస్తూనే.

"మీ కోసం చూశాం. మీరు రాలేదు. మరో డాక్టర్ దగ్గరకు వెళదాం అంటే రానంది జిగీష. అందుకే ఎవరో చెప్పిన మాటలు విని. నాటుపద్ధతి ద్వారా అబార్షన్ చేయించుకోవానని ప్రయత్నించాం. డాక్టర్! కావాలంటే నా ప్రాణం యిస్తాను. ప్లీజ్! డాక్టర్, ప్లీజ్!!" అంటూ కట్టలు తెంచుకున్న దుఃఖంతో రోదిస్తూ, విశ్వమోహన్ కాళ్ళు పట్టుకున్నాడు, ఆ అబ్బాయి.

డాక్టర్ హృదయం అర్థమయింది. జిగీషను క్షణాలమీద ప్రత్యేక మైన గదిలోకి తరలించారు. ఐదు నిముషాల తర్వాత, బయటకొచ్చాడు, డాక్టర్. కన్నీళ్ళతో ఎదురెళ్ళిన ఆ ప్రేమికునికి.

"ఇట్ ఈజ్ టూ లేట్? ఐయామ్ సారీ!" అనిచెప్పి, తన గది లోకి వెళ్ళబోయిన డాక్టర్‌ను ఆపి, పిచ్చిపట్టిన వానిలా అరుస్తూ, "డాక్టర్!

వియార్ నాట్ లేట్; యు ఆర్ టూ లేట్! అవాళే మీరుసతే అనివుంటే— ఆ తర్వాతయినా ఒప్పుకునివుంటే - ప్చ్ - నా జిగీష చనిపోయేది కాదు- మై లవ్!" అని రోదిస్తూ- జిగీష ఆఖరి శ్వాస వదిలిన గదిలోకి పరుగు పరుగున వెళ్ళాడు, ఆమెలేని ప్రియుడు.

చివరి క్షణంవరకూ ఆ అమ్మాయిమీద ఆ అబ్బాయికున్న అను రాగానికి విశ్వమోహన్ ముగ్ధుడై, విశ్వాసంగల ఆ ప్రేమికునికి మనసారా జోహార్లు చెప్పాడు. తన గదిలోకి వెళ్ళి, రాజశేఖర్‌కు ఫోన్‌చేసి, పిలి పించాడు క్షణాల మీద. రాజశేఖర్‌మీద ఎక్కడలేని కసి పుట్టుకొచ్చింది విశ్వమోహన్‌కు, "చూశావా, శేఖర్! మన నెగ్లిజన్స్‌వల్ల ఒక గులాబీ పువ్వు పూర్తిగా వికసించక ముందే నేలరాలిపోయింది." అంటూ కేసును వివరించాడు విశ్వమోహన్. "నేనందుబాటు కాకపోవడంతో—స్నేహితుల మాట నమ్మి—నాటు పద్ధతులతో మోటుగా అబార్షన్ చేయించుకుందా అమ్మాయి. వోవర్ బ్లీడింగ్, గర్భకోశం పొక్కి పోవడంతో ముక్కు పచ్చలారని ఆ అమ్మాయికి నూరేళ్ళు నిండాయి. ఇది మనం చూచిన కేసు—మనకు తెలియకుండా యిలాటి చావులు మరెన్నో? ఊహించుకోవ డానికే భయంగావుంది. ఫాలోమి—ఎంత హృదయ విదారకమో, ఆ అమ్మా యిని చూద్దువుకానీ—" అంటూ రాజశేఖర్‌ను ఆ అమ్మాయి శవం వున్న గదిలోకి తీసుకెళ్లాడు.

ఆ అమ్మాయిని చూసిన రాజశేఖర్ గావు కేక పెట్టాడు, "మోహన్! షి ఈజ్ మై డాటర్ – మై ఓన్లీ డాటర్-జిగీష-అమ్మా!" అని బావురు మంటూ కుప్పలా కూలిపోయాడు స్తంభించిపోయిన డాక్టర్ విశ్వమోహన్ ముందు!

[ఇది కథగా రూపం దిద్దుకునేందుకు సహకరించిన నేస్తం మల్లె మాల శ్యాంబాబుకు డాక్టర్ మల్లెమాల శారదగారికి కృతజ్ఞతలతో— జయంప కృష్ణ]